క్లుప్తంగా

సీఐ రమేశ్‌కు సన్మానం

ఆసిఫాబాద్‌: జిల్లా కేంద్రంలో ఎస్సైగా విధులు నిర్వహిస్తూ పదోన్నతి పొందిన సీఐ రమేశ్‌ను మంగళవారం బీజేపీ ఎస్సీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు మాటూరి జయరాజ్‌ ఆధ్వర్యంలో స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సన్మానించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి సూర్యప్రకాశ్‌, బూత్‌ అధ్యక్షుడు మాటూరి నికిల్‌, గ్రామ అధ్యక్షులు కుమార్‌ జాలే, నాగేశ్‌ పాల్గొన్నారు.

గ్రంథాలయం ప్రారంభం

కెరమెరి: బాగా చదివి ఉన్నతంగా ఎదగాలని ఎంపీడీవో సత్యనారాయణగౌడ్‌, సర్పంచ్‌ రజిత అన్నారు. మంగళవారం మండలంలోని గోయగాం గ్రామంలో గ్రంథాలయాన్ని వారు ప్రారంభించారు. గ్రంథాలయానికి కావాల్సిన టేబుళ్లను విరాళంగా అందిస్తామని సర్పంచ్‌ రజిత తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌ఎం రమేశ్‌, గ్రామ పంచాయతీ కార్యదర్శి బొజ్జు, విద్యార్థులు, గ్రామస్తులు ఉన్నారు.

ఎస్పీఎం హెచ్‌ఆర్‌డీ హాల్‌లో రక్తదాన శిబిరం

కాగజ్‌నగర్‌టౌన్‌: కాగజ్‌నగర్‌ పట్టణంలోని సిర్పూర్‌ పేపర్‌ మిల్లు హెచ్‌ఆర్‌డీ హాల్‌లో మంగళవారం రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. స్వర్గీయ హరిశంకర్‌ సింగ్‌ జీ సింఘానియా 90వ జయంతి పురస్కరించుకొని ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. మిల్లు అధికారులు, ఉద్యోగులు, కార్మికులు పాల్గొని రక్తదానం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతీఒక్కరు స్వచ్ఛందంగా రక్తదానం చేసి ఆపదలో ఉన్నవారిని ఆదుకోవాలని కోరారు.

జిల్లాకేంద్రంలో వర్షం

ఆసిఫాబాద్‌: జిల్లా కేంద్రంలో మంగళవారం మధ్యాహ్నం ఓ మోస్తరు వర్షం కురిసింది. గత కొన్ని రోజులుగా వర్షం కోసం ఎదురుచూస్తున్న రైతులకు కాస్త ఊరట లభించింది. వర్షం రాకతో వాతావరణం చల్లబడింది.

గాలి దుమారం..

కౌటాల: మండలంలో మంగళవారం సాయంత్రం ఈదురు గాలులతో కూడిన మోస్తారు వర్షం కురిసింది. ఈదురు గాలులకు మండల కేంద్రంలోని నదిమాబాద్‌ కాలనీకి చెందిన శాంతబాయి, కిశోర్‌ ఇళ్ల రేకులు ఎగిరిపడ్డాయి. దీంతో శాంతబాయి కుమార్తె పహేల్‌ తలపై రేకులు పడడంతో తలకు గాయాలయ్యాయి. రేకులు ఎగిరిపోవడంతో ఇంట్లోని ధాన్యం తడిసి పోయిందని బాధితులు వాపోయారు. కౌటాల ఉప సర్పంచ్‌ తిరుపతి, కార్యదర్శి సాయికృష్ణ బాధితులను పరామర్శించారు.

రాజ్యాధికార పార్టీలో మహిళలకు పెద్దపీట

ఆసిఫాబాద్‌: మహిళలకు రాజ్యాధికార పార్టీలో పెద్దపీట వేస్తున్నట్లు ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కోట వెంకన్న అన్నారు. జిల్లా కేంద్రంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ పార్టీ జాతీయ అధ్యక్షుడు నారగోని మహిళలకు అధిక సీట్లు కేటాయించి అత్యంత ప్రాధాన్యం ఇచ్చారన్నారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో తమ పార్టీ మహిళలకు 80శాతం సీట్లు కేటాయించనున్నట్లు తెలిపారు.

ట్రెయినీ ఎఫ్‌బీవోల సందర్శన

బెజ్జూర్‌: కుశ్నపల్లి సెక్షన్‌ పరిధిలోని ఇందర్గావ్‌ బీట్‌ను ట్రెయినీ ఎఫ్‌బీవోలు రెండోరోజు మంగళవారం సందర్శించారు. టేకు అడవి, రాముడు భీముడు చెట్లు, బేస్‌ క్యాంప్‌, అటవీ సంరక్షణ కోసం చేపడుతున్న చర్యలు, బెజ్జూర్‌ సెక్షన్‌ నందలి, ఎల్కపల్లి నర్సరీలను పరిశీలించారు. కోర్స్‌ డైరెక్టర్‌ రామకృష్ణ, అసిస్టెంట్‌ కోర్స్‌ డైరెక్టర్‌ రామ్మోహన్‌, ఎఫ్‌ఆర్‌వో దయాకర్‌, అటవీ అధికారులు శ్రావణ్‌ కుమార్‌, శ్రీనివాస్‌, ముత్యం పాల్గొన్నారు.

వేజ్‌బోర్డుపై దుష్ప్రచారం చేస్తున్న సంఘాలకు బుద్ధి చెప్పాలి

రెబ్బెన: బొగ్గు గని కార్మికుల కోసం మెరుగైన వేజ్‌బోర్డును సాధిస్తే దానిపై దుష్ప్రచారం చేస్తున్న సంఘాలకు కార్మికులే తగిన బుద్ధి చెప్పాలని ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి వాసిరెడ్డి సీతారామయ్య అన్నారు. మంగళవారం బెల్లంపల్లి ఏరియాలోని ఖైరిగూడ ఓసీపీలో ఏఐటీయూసీ గేట్‌ మీటింగ్‌ నిర్వహించగా ముఖ్య అతిథిగా హాజరయ్యారు. బ్రాంచి ఇన్‌చార్జి చిప్ప నర్సయ్య, బ్రాంచి కార్యదర్శి ఎస్‌.తిరుపతి, ఆర్గనైజింగ్‌ కార్యదర్శులు జగ్గయ్య, శేషు, రహమాన్‌, శ్రీనివాస్‌, చంద్రశేఖర్‌, కిరణ్‌బాబు, ఆనంద్‌, నాయకులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

కౌటాల: పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని మండలంలోని పంచాయతీ కార్మికులు మంగళవారం కౌటాల ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీవో మౌనికకు సమ్మె నోటీసు అందించారు. వారు మాట్లాడుతూ గ్రామ పంచాయతీ సిబ్బందిని క్రమబద్ధీకరించాలని, కార్మికుల వేతనాలను పెంచాలన్నారు. నాయకులు మోరేశ్వర్‌, నాగేష్‌, ప్రకాశ్‌, ప్రవీణ్‌, పద్మాకర్‌, పాల్గొన్నారు.

'లింగం సేవలు అభినందనీయం'

కాగజ్‌నగర్‌టౌన్‌: మున్సిపల్‌ మాజీ చైర్మన్‌ దివంగత బుచ్చిలింగం సేవలు అభినందనీయమని పద్మశాలి సేవా సంఘం నాయకులు కొనియాడారు. మంగళవారం స్థానిక పద్మశాలి భవన్‌లో మున్సిపల్‌ మాజీ చైర్మన్‌ గుల్లపల్లి బుచ్చి లింగం నాలుగో వర్ధంతి నిర్వహించారు. పద్మశాలి సంఘం పదాధికారులు, నాయకులు, అభిమానులు పాల్గొన్నారు.

ఘనంగా విద్యా దినోత్సవం



కాగజ్‌నగర్‌టౌన్‌: నోటు పుస్తకాలతో విద్యార్థులు

కెరమెరి: తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మంగళవారం విద్యా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆయా గ్రామాల్లోని పాఠశాలల్లో విద్యార్థులకు యూనిఫామ్‌లు, ఉచిత పాఠ్యపుస్తకాలు, నోటుబుక్స్‌ అందించారు. కార్యక్రమంలో ఎంఎస్‌వో ఆడే ప్రకాశ్‌, గోయగాం కాంప్లెక్స్‌ ప్రధానోపాధ్యాయులు నల్లగొండ రమేశ్‌ పాల్గొన్నారు.

విద్యతోనే ప్రగతి..

విద్యతోనే ప్రగతి సాధ్యమని జిల్లా గ్రంథాలయ చైర్మన్‌ కనక యాదోరావు అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న విద్యా ఉత్సవాల్లో భాగంగా సిర్పూర్‌(యూ) జెడ్పీటీసీ కోవ అరుణతో కలిసి ఆయా మండలాల్లోని కార్యక్రమాల్లో పాల్గొన్నారు. జైనూర్‌ మండలంలోని జంగాంలో మినీ అంగన్‌వాడీ కేంద్రాన్ని ప్రారంభించారు. సిర్పూర్‌(యూ) మండల కేంద్రంలో మన ఊరు –మన బడిలో భాగంగా పాఠశాలను ప్రారంభించారు. ఆయా పాఠశాలల్లో ఉచిత పాఠ్యపుస్తకాలు, యూనిఫాంలు పంపిణీ చేశారు.

కాగజ్‌నగర్‌ పట్టణంలో..

కాగజ్‌నగర్‌టౌన్‌: చదువుతోనే సమాజంలో గుర్తింపు ఉంటుందని 10వ వార్డు కౌన్సిలర్‌ వనమాల విజయరాము అన్నారు. తెలంగాణ రాష్ట్ర దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మంగళవారం స్థానిక ప్రాథమిక పాఠశాలలో విద్యాదినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జాతీయ జెండా ఆవిష్కరించి ప్రభుత్వం అందజేస్తున్న నోట్‌ పుస్తకాలను విద్యార్థులకు అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు వేణుగోపాల్‌, విద్యార్థులు పాల్గొన్నారు.

తిర్యాణిలో..

తిర్యాణి: విద్య ద్వారానే సమాజ సమగ్ర అభివృద్ధి సాధ్యమవుతుందని ఎంపీపీ మర్సుకోల శ్రీదేవి అన్నారు. మంగళవారం విద్యా దినోత్సవం సందర్భంగా మండలంలోని అన్ని పాఠశాలల్లో వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ ఆత్రం చంద్రశేఖర్‌, మార్కెట్‌ కమిటీ వైస్‌చైర్మన్‌ హన్మండ్ల జగదీశ్‌, పీఏసీఎస్‌ చైర్మన్‌ చుంచు శ్రీనివాస్‌, పాఠశాల ప్రధానోపాధ్యాయులు సెడ్మకి రాము తదితరులు ఉన్నారు.



కెరమెరి: గోయగాంలో విద్యార్థుల ర్యాలీ

ఆసిఫాబాద్‌ మండలంలో..

ఆసిఫాబాద్‌రూరల్‌: విద్యా దినోత్సవం సందర్భంగా మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో జాతీయ జెండా ఎగురవేశారు. స్థానిక సర్పంచ్‌, ఉప సర్పంచ్‌లు విద్యార్థులకు పుస్తకాలు, దుస్తులు, నోట్‌బుక్స్‌ పంపిణీ చేశారు. ఎంపీవో ప్రసాద్‌, ఉపాధ్యాయులు, నాయకులు వినోద్‌, రాందాస్‌, విద్యార్థులు పాల్గొన్నారు.

దహెగాంలో..

దహెగాం: ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య నందించడమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని జెడ్పీ వైస్‌చైర్మన్‌ కోనేరు కృష్ణారావు అన్నారు. మంగళవారం తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా బీబ్రా గ్రామంలో విద్యా దినోత్సవాన్ని జరుపుకున్నారు. అనంతరం ప్రాథమిక పాఠశాలలో మన ఊరు మనబడిలో భాగంగా పాఠశాల ప్రారంభించారు. జిల్లా పరిషత్‌ ఉన్నత పాఠశాలలో ఆయన డిజిటల్‌ తరగతులు ప్రారంభించగా, స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయంలో గ్రంథాలయాన్ని జెడ్పీటీసీ తాళ్లపల్లి రామారావు ప్రారంభించారు. పీఆర్‌ ఈఈ రామ్మోహన్‌, సర్పంచులు బండ క్రిష్ణమూర్తి, పుప్పాల లక్ష్మి, ఎంఈవో బిక్షపతి, ప్రధానోపాధ్యాయులు జయలక్ష్మి, సదానందం, ఉపాధ్యాయులు జయేందర్‌, స్రవంతి తదితరులు పాల్గొన్నారు.

పెంచికల్‌పేట్‌లో..

పెంచికల్‌పేట్‌: తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు ప్రధాన వీధుల గుండా ర్యాలీ నిర్వహించారు. అనంతరం పాఠశాలల్లో పాఠ్య పుస్తకాలు పంపిణీ చేశారు. తహసీల్దార్‌ సరిత, ఎంపీడీవో గంగ సింగ్‌, ప్రధానోపాధ్యాయులు యాదగిరి, విద్యార్థులు పాల్గొన్నారు.

కౌటాలలో..

కౌటాల: తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మంగళవారం మండలంలోని ఆయా పాఠశాలల్లో విద్యా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆయా గ్రామాల్లో విద్యార్థులు ర్యాలీ తీశారు. ఎంఈవో సోమయ్య, డీసీఎంఎస్‌ వైస్‌చైర్మన్‌ కుమురం మాంతయ్య, సర్పంచులు, హెచ్‌ఎంలు తదితరులు పాల్గొన్నారు.

రెబ్బెనలో..

రెబ్బెన: మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో మంగళవారం తెలంగాణ రాష్ట్ర దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా విద్యా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఇందిరానగర్‌, నంబాల, పులికుంట కాలనీ, రెబ్బెన, గంగాపూర్‌ కేజీబీవీలలో విద్యా దినోత్సవాన్ని పురస్కరించుకుని జాతీయ జెండాలు ఎగురవేశారు. ఎంఈవో వెంకటేశ్వరస్వామి, ఎస్‌వో పద్మ, ఉపాధ్యాయులు రవికుమార్‌, సోమశేఖర్‌, సదానందం, సాయికృష్ణ, అంగన్‌వాడీ టీచర్లు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

కళాశాలల్లో విద్యా దినోత్సవం

ఆసిఫాబాద్‌రూరల్‌: జిల్లాలోని కళాశాలల్లో ఘనంగా విద్యా దినోత్సవం నిర్వహించినట్లు డీఐఈవో శ్రీధర్‌ సుమన్‌ తెలిపారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్‌ కళాశాలలో మంగళవారం ఏర్పాటు చేసిన విద్యా దినోత్సవంలో పాల్గొన్నారు. ఇంటర్‌లో ఉత్తమ ఫలితాలు, ఐఐటీ (జేఈఈ), ఎంసెట్లో ర్యాంకులు సాధించిన విద్యార్థులను సన్మానించారు.

ప్రభుత్వ బడుల్లోనే మెరుగైన వసతులు

సిర్పూర్‌(టి): ప్రభుత్వ బడుల్లో మెరుగైన వసతులు ఉన్నాయని, తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని ఎమ్మెల్యే కోనేరు కోనప్ప అన్నారు. విద్యాదినోత్సవం సందర్భంగా కలెక్టర్‌ హేమంత్‌ బోర్కడేతో కలిసి మండలంలోని వేంపల్లి, పెద్దబండ గ్రామాల్లో నూతనంగా నిర్మించిన పాఠశాలలను మంగళవారం ప్రారంభించారు. సర్కారు పాఠశాలల్లో ఇంగ్లిష్‌ మీడియం, డిజిటల్‌ తరగతులు, నాణ్యమైన భోజన వసతి కల్పిస్తున్నామని తెలిపారు. ప్రజలు కలిసికట్టుగా బడుల అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. కలెక్టర్‌ మాట్లాడుతూ మన ఊరు–మన బడి కార్యక్రమంలో పాఠశాలలను ఉత్తమంగా తీర్చిదిద్దుతున్నామన్నారు. అనంతరం విద్యార్థులకు దుస్తులు, విద్యాసామగ్రి పంపిణీ చేశారు.

అదనపు తరగతుల నిర్మాణానికి భూమిపూజ

సిర్పూర్‌(టి)లోని సాంఘిక సంక్షేమ బాలికల సమీకృత భవనంలో గల సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల(కాగజ్‌నగర్‌)కు రెండు అదనపు తరగతి గదుల నిర్మాణానికి కలెక్టర్‌ హేమంత్‌ బోర్కడే, ఎమ్మెల్యే కోనప్ప భూమిపూజ నిర్వహించారు. అదనపు గదుల నిర్మాణానికి రూ.కోటి నిధులు మంజూరయ్యాయని తెలిపారు. గురుకుల పాఠశాల/కళాశాలలో ఇంటర్‌ ఫలితాల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థినులను సన్మానించారు. ఆయా కార్యక్రమాల్లో వైస్‌ ఎంపీపీ సత్యనారాయణ, మండల కోఆప్షన్‌ సభ్యుడు కిజర్‌హుస్సేన్‌, సర్పంచులు రవి, లక్ష్మి, ఎంపీటీసీ తుకారాం, ఉపసర్పంచ్‌ మహేష్‌, డీసీవో బాలరాజు, ప్రిన్సిపాల్‌ సంగీత, నాయకులు పాల్గొన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాల అభివృద్ధికి కృషి

కాగజ్‌నగర్‌టౌన్‌: కాగజ్‌నగర్‌ ప్రభుత్వ డిగ్రీ కళాశాల అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే కోనప్ప అన్నారు. విద్యాదినోత్సవం సందర్భంగా మంగళవారం ప్రభుత్వ డిగ్రీ కళాశాలను కలెక్టర్‌ హేమంత్‌ బోర్కడేతో కలిసి సందర్శించారు. కళాశాల పాత భవనానికి మరమ్మతులు, సెమినార్‌ హాల్‌, విద్యుత్‌సౌకర్యం, మూత్రశాలల నిర్మాణం, తదితర పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్‌ లక్ష్మీనరసింహం, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్‌ ఇంజనీర్‌ శ్రీనివాస్‌, అసిస్టెంట్‌ ఇంజనీర్‌ వెంకటేశ్వర్లు, అధ్యాపకులు రాజు, జనార్దన్‌, రాజేశ్వర్‌, దత్తాత్రేయ తదితరులు పాల్గొన్నారు.



సిర్పూర్‌(టి)లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోనప్ప, పక్కన కలెక్టర్‌ హేమంత్‌ బోర్కడే

మౌలిక సదుపాయాల కల్పనకు..

కాగజ్‌నగర్‌రూరల్‌: మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం కృషి చేస్తుందని కలెక్టర్‌ హేమంత్‌ బోర్కడే సహదేవరావు అన్నారు. మంగళవారం విద్యా దినోత్సవం సందర్భంగా మండలంలోని చింతగూడ కోయవాగు గ్రామంలో అదనపు తరగతుల నిర్మాణం, తాగునీటి పంపు, బాత్‌రూంలను ఎమ్మెల్యే కోనేరు కోనప్పతో కలిసి ప్రారంభించారు. ఎమ్మెల్యే కోనేరు కోనప్ప మాట్లాడుతూ మన ఊరు మన బడి కార్యక్రమం ద్వారా పాఠశాలల రూపురేఖలు మార్చడం చాలా గొప్పవిషయమన్నారు. అనంతరం ప్రభుత్వం అందజేస్తున్న ఉచిత పుస్తకాలు, దుస్తులు పంపిణీ చేశారు. డీఈవో అశోక్‌, జెడ్పీ వైస్‌చైర్మన్‌ కోనేరు కృష్ణారావు, తహసీల్దార్‌ మునావర్‌ షరీఫ్‌, ఎంపీడీవో గౌరీశంకర్‌, జిల్లా పరిషత్‌ కోఆప్షన్‌సభ్యులు సిద్దిక్‌, బాబా పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం

కెరమెరి: తెలంగాణ ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మంగళవారం జిల్లా కేంద్రంలోని ఆదివాసీ భవన్‌లో నిర్వహించిన విద్యా దినోత్సవంలో కెరమెరి మండలంలోని సావర్‌ఖెడా ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రంగయ్యను జెడ్పీ చైర్మన్‌ కోవ లక్ష్మి, ఎమ్మెల్యే ఆత్రం సక్కు, కలెక్టర్‌ హేమంత్‌ బోర్కడే, అదనపు కలెక్టర్‌ చాహత్‌ బాజ్‌పాయ్‌, డీఈవో అశోక్‌లు సన్మానించారు. ఉత్తమ ఉపాధ్యాయులుగా మండలం నుంచి టేకం భాస్కర్‌, ప్రవీణ్‌ కుమార్‌, కోట్నాక్‌ విమల, క్రాంతి కుమార్‌లు, బెస్ట్‌ పేరెంట్‌గా ప్రశాంత్‌, బెస్ట్‌ ఎస్‌ఎంసీ చైర్మన్‌గా నారాయణలు ఎంపికయ్యారు.

ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఆదె శివాజీ..



పురస్కారంతో ఆదె శివాజీ

చింతలమానెపల్లి: మండలంలోని టేకంగూడ ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్న ఆదె శివాజీ ఉత్తమ ఉపాధ్యాయునిగా ఎంపికయ్యారు. ఈమేరకు మంగళవారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన దశాబ్ది ఉత్సవాల్లో పురస్కారాన్ని జిల్లా కలెక్టర్‌ హేమంత్‌ సహదేవరావు చేతుల మీదుగా అందుకున్నారు.

ఉత్తమ ఎస్‌ఎంసీ చైర్మన్‌గా టేకం పోషన్న



అవార్డు అందుకుంటున్న పోషన్న

రెబ్బెన: మండలంలోని పులికుంట కాలనీ పాఠశాల ఎస్‌ఎంసీ చైర్మన్‌ టేకం పోషన్న పాఠశాల అభివృద్ధి కోసం చేసిన కృషికి గుర్తింపుగా ఉత్తమ ఎస్‌ఎంసీ చైర్మన్‌గా ఎంపికయ్యారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మంగళవారం జిల్లా కేంద్రంలోని ఆదివాసీ భవన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అదనపు కలెక్టర్‌ చాహత్‌ బాజ్‌పాయ్‌ చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు.



కెరమెరిలో జెండా ఎగురవేస్తున్న హెచ్చెం



జైనూర్‌లో..



తిర్యాణి: పాఠ్యపుస్తకాలు అందజేస్తున్న ఎంపీపీ



దహెగాంలో ర్యాలీ చేస్తున్న విద్యార్థులు



ఆసిఫాబాద్‌రూరల్‌: మోతుగూడలో..

పాఠశాలల్లో అన్ని రకాల వసతులు కల్పిస్తున్నాం

రెబ్బెన: మన ఊరు మన బడి కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని రకాల వసతులు కల్పిస్తున్నామని జెడ్పీ చైర్‌పర్సన్‌ కోవ లక్ష్మి అన్నారు. మండలంలోని నేర్పల్లి పాఠశాలలో మన ఊరు మన బడి కార్యక్రమంలో నిర్మించిన గదులను మంగళవారం ఆమె ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ కార్పొరేట్‌ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు ఏర్పడుతున్నాయన్నారు. అనంతరం విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు అందజేశారు. జెడ్పీటీసీ వేముర్ల సంతోష్‌, ఎంపీపీ జుమ్మిడి సౌందర్య, ఎంఈవో వెంకటేశ్వరస్వామి, పీఏసీఎస్‌ చైర్మన్‌ సంజీవ్‌కుమార్‌, ఎంపీడీవో శ్రీనివాస్‌, సర్పంచ్‌ శాంత తదితరులు పాల్గొన్నారు.



పాఠ్యపుస్తకాలు అందజేస్తున్న కోవ లక్ష్మి

వాంకిడిలో..

వాంకిడి: విద్యారంగ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని జెడ్పీ చైర్‌ పర్సన్‌ కోవ లక్ష్మి, అదనపు కలెక్టర్‌ చాహత్‌ బాజ్‌పాయ్‌ అన్నారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా నిర్వహిస్తున్న తెలంగాణ విద్యా దినోత్సవం సందర్భంగా మంగళవారం మండలంలోని చిన్న బెండార, అర్జుగూడ పాఠశాలల్లో మన ఊరు మన బడి పథకం కింద నిర్మించిన తరగతి గదులను ప్రారంభించారు. ఎంపీపీ విమలబాయి, జెడ్పీటీసీ అజయ్‌కుమార్‌, పీఏసీఎస్‌ చైర్మన్‌ పెంటు, సెక్టోరల్‌ అధికారులు సత్తయ్య, రాథోడ్‌ సుభాశ్‌, ఎంఈవో మనుకుమార్‌ తదితరులు పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి కృషి

చింతలమానెపల్లి: విద్యార్థుల సంక్షేమమే లక్ష్యంగా విద్యాభివృద్ధి కోసం ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే కోనేరు కోనప్ప అన్నారు. బుధవారం మండలంలోని గూడెం, ఖర్జెల్లి గ్రామాలలో మన ఊరు మన బడి కార్యక్రమంలో భాగంగా పనులు పూర్తయిన పాఠశాలలను ఆయన ప్రారంభించారు. జిల్లా రైతుబంధు సమితి అధ్యక్షుడు జగ్గాగౌడ్‌, మార్కెట్‌ కమిటీ వైస్‌చైర్మన్‌ డోకె రాజన్న, ఎంపీపీలు నానయ్య, విశ్వనాథ్‌, తహసీల్దార్‌ మష్కూర్‌ అలీ, ఎంపీడీవో సుధాకర్‌ రెడ్డి, కోఆప్షన్‌ సభ్యులు నాజిం హుస్సేన్‌, సర్పంచులు నానయ్య, రాఘవరెడ్డి, ఇంజనీరింగ్‌ అధికారి బద్రుద్దీన్‌ తదితరులు పాల్గొన్నారు.

కౌటాలలో..

కౌటాల: ప్రభుత్వ జూనియర్‌ కళాశాలల్లో విద్యార్థులకు మెరుగైన విద్య అందించడమే ప్రభుత్వ లక్ష్యమని సిర్పూర్‌(టి) ఎమ్మెల్యే కోనేరు కోనప్ప అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్‌ కళాశాలలో అదనపు గదుల నిర్మాణానికి పూజలు చేశారు. ఆయన మాట్లాడుతూ కళాశాలల్లో అన్ని సౌకర్యాలు కల్పించడానికి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. అదనపు గదుల నిర్మాణానికి ప్రభుత్వం రూ.50లక్షల నిధులు మంజూరు చేసిందని తెలిపారు. తహసీల్దార్‌ సాయన్న, ఎంపీపీ విశ్వనాథ్‌, కోఆప్షన్‌ సభ్యులు అజ్మత్‌, ప్రిన్సిపాల్‌ స్వరూప, సర్పంచులు మౌనిశ్‌, శ్రీనివాస్‌, ఉప సర్పంచ్‌ తిరుపతి, కార్యదర్శి సాయికృష్ణ, నాయకులు మధుకర్‌, వెంకన్న, రవీందర్‌గౌడ్‌, బాపు, శంకర్‌, నాహీం, శ్రీనివాస్‌, రాంచందర్‌ తదితరులు పాల్గొన్నారు.

నీళ్లు రాక తిప్పలు



బోర్‌వెల్‌ వద్ద పడిగాపులు కాస్తున్న ఆదివాసీలు

తిర్యాణి: మండలంలోని గుండాల గ్రామంలో గత కొన్ని రోజులుగా మిషన్‌ భగీరథ నీటి సరఫరా జరగక పోవడంతో తాగునీటి కోసం ఆదివాసీలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గ్రామంలో ఏడు ఆవాస గ్రామాలకు ఏడు బోర్‌వెల్‌లు ఉండగా గుక్కెడు నీటి కోసం ఉదయం నుంచే బోర్‌వెల్‌ వద్ద బారులు తీరున్నారు. అధికారులు స్పందించి మిషన్‌ భగీరథ నీటి సరఫరా చేపట్టేలా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు వేడుకుంటున్నారు.

చేతిపంపునకు మరమ్మతులు



చేతిపంపు వద్ద బాటిల్‌లో నీరు పడుతున్న చిన్నారి

సాక్షి ఎఫెక్ట్‌..

బెజ్జూర్‌: మండలంలోని చిన్నసిద్దాపూర్‌ ప్రాథమిక ఉన్నత పాఠశాల, అంగన్‌వాడీ చిన్నారులు ఎదుర్కొంటున్న నీటి సమస్యపై 'సాక్షి'లో మంగళవారం 'తాగునీటికి విద్యార్థుల తిప్పలు' శీర్షికన కథనం ప్రచురితం కాగా అధికారులు స్పందించారు. పాఠశాల ఆవరణలో నిరుపయోగంగా మారిన చేతిపంపునకు మరమ్మతులు చేయించారు. దీంతో విద్యార్థుల నీటి కష్టాలు తీరాయి.

గడపగడపకూ సర్వే నిర్వహించాలి

ఆసిఫాబాద్‌: స్పష్టమైన ఓటరు జాబితా తయారీకి బూత్‌స్థాయి అధికారులు గడపగడపకూ వెళ్లి సర్వే నిర్వహించాలని కలెక్టర్‌ హేమంత్‌ బోర్కడే అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌ సమావేశ మందిరంలో ఇన్‌చార్జి డీఆర్‌వో రాజేశ్వర్‌తో కలిసి వివిధ రాజకీయ పార్టీల ప్రజాప్రతినిధులతో ఓటరు జాబితా రూపకల్పనపై సమీక్షా సమావేశం నిర్వహించారు. కలెక్టర్‌ మాట్లాడుతూ పొరపాట్లు లేకుండా ఓటరు జాబితా రూపొందించేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. జాబితాలో వివరాల నమోదు, పేర్ల తొలగింపుపై అవగాహన కల్పించాలన్నారు. ప్రతీ పోలింగ్‌ కేంద్రంలో రాజకీయ పార్టీల నాయకులు ఏజెంట్లను నియమించుకోవాలని సూచించారు. జాబితా రూపకల్పనకు అధికారులకు సహకరించాలన్నారు.

పెంచిన వేతనాలు చెల్లించాలి

దహెగాం: మధ్యాహ్న భోజన కార్మికులకు పెంచిన వేతనాలను వెంటనే విడుదల చేయాలని సీఐటీయూ జిల్లా నాయకుడు వెలిశాల క్రిష్ణమాచారి అన్నారు. మంగళవారం మధ్యాహ్న భోజన కార్మికులతో కలిసి స్థానిక ఎమ్మార్సీ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ 2022 మార్చిలో సీఎం కేసీఆర్‌ అసెంబ్లీలో మధ్యాహ్న భోజన కార్మికులకు రూ.2వేలు వేతనం పెంచుతున్నట్లు ప్రకటించారన్నారు. నేటికీ వేతనాల పెంపు జీవో అమలు కాలేదన్నారు. మధ్యాహ్న భోజన కార్మికులు లావణ్య, కవిత, పార్వతి, లలిత, వనిత పాల్గొన్నారు.

గురుకులాన్ని కాగజ్‌నగర్‌లో ఏర్పాటు చేయాలి

సిర్పూర్‌(టి): సిర్పూర్‌(టి) మండల కేంద్రంలోని సాంఘీక సంక్షేమ సమీకృత వసతి గృహంలో కొనసాగుతున్న సాంఘీక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల, కళాశాల(కాగజ్‌నగర్‌)ను కాగజ్‌నగర్‌ మండలంలో ఏర్పాటు చేయాలని పాఠశాల తల్లిదండ్రుల కమిటీ సభ్యులు మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. కాగజ్‌నగర్‌ గురుకులాన్ని తాత్కాలికంగా సిర్పూర్‌(టి)లో కొనసాగిస్తున్నారని దీంతో వసతిగృహ భవనంలో విద్యార్థులకు వసతులు, సౌకర్యాలు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. గురుకులం కొనసాగుతున్న భవనంలో వసతులు లేక విద్యార్థులు అనారోగ్యాలకు గురవుతున్నారని, అధికారులు స్పందించి కాగజ్‌నగర్‌ మండలానికి తరలించాలని కోరారు. ధన్‌రాజ్‌, సుధీర్‌కుమార్‌, కృష్ణ, రవీందర్‌, జ్యోతి, వనిత, లక్ష్మీ ఉన్నారు.

నేడు ఎమ్మెల్యే పర్యటన

బెజ్జూర్‌: సిర్పూర్‌ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప బుధవారం మండలంలో పర్యటించనున్నట్లు జెడ్పీటీసీ పంద్రం పుష్పలత, ఎంపీపీ డోకే రోజారమణి వెంకన్న, బీఆర్‌ఎస్‌ పార్టీ మండల అధ్యక్షుడు సిడాం సకారాంలు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

విద్యుత్‌ సరఫరాలో అంతరాయం

రెబ్బెన: మండల కేంద్రంలోని రెబ్బెన సబ్‌స్టేషన్‌ పరిధిలో మరమ్మతుల కారణంగా బుధవారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్‌ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ ఇమ్రాన్‌ తెలిపారు. మండల కేంద్రంలోని సబ్‌స్టేషన్‌ రోడ్డు నుంచి ఎంపీడీవో ఆఫీస్‌, సీఐ ఆఫీస్‌, ఎస్టీ కాలనీలకు సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు.

కౌటాల: కౌటాల విద్యుత్‌ సబ్‌స్టేషన్‌లోని చీపురుదుబ్బ ఫీడర్‌, గుండాయిపేట విద్యుత్‌ సబ్‌స్టేషన్‌లోని గుడ్లబోరి ఫీడర్‌లో మూడు రోజుల పాటు మరమ్మతులు చేయనున్నట్లు ఏఈ రవీందర్‌ మంగళవారం తెలిపారు. గుడ్లబోరి, రణవెల్లి, వైగాం, టేకంగూడ, విజయనగరం, తాటినగర్‌, యాపలగూడ, గురుడుపేట, కన్నేపల్లి, బోదంపల్లి, కనికి, చీపురుదుబ్బ గ్రామాలకు బుధ, గురు, శుక్రవారాల్లో ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు అంతరాయం ఉంటుందన్నారు.